**120**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల


మత్తి భానుమూర్తి ...
99893 71284


**జరిగిన కథ :** వయస్సు పడమటికి మళ్లింది. ఒంటరి జీవితం. 'తిన్నావా తినలేదా?' అని అడిగే వారెవ్వరూ లేరు. ఉన్నదల్లా.. పిల్లల కోసం హడావుడి పడిపోయే ఓ అమాయకురాలైన అక్క. తెలుగు రాజ్యస్థాపనమే జీవనపరమావధిగా బతికే బావ. అప్పుడప్పుడూ ఎవరో తన భుజానికి తాకుతూ నిలబడినట్లు.. కాకతి! ఇప్పటికీ దేవాలయాల్లో కాకతి కోసం వేయికళ్లతో వెదుకుతాడు. ఛ్ఛ! ఆశ.. నిరాశ! కాదుకాదు.. నిరాశ కాదు కేవలం ఆశ!

పుర నివాసంలోని మొదటి అంతర్వు. గవాక్షంవద్ద నిలబడి.. వీధులను పరికిస్తున్నాడు జాయపుడు. ఏదో ఆలోచనల్లో మునిగిపోయాడు. వెనక ఏదో అలికిడి.

చటుక్కున చేతులు మహావేగంగా కదిపి.. వెనుక దగ్గరగా వచ్చిన ఆ వ్యక్తిని పట్టిఎత్తి గిర్రునతిప్పి దూరంగా విసిరివేయబోయాడు.

''మామా.. మామా! నేనూ.. పాహిమాం! క్షమించండి..'' అరుస్తున్నాడా ఆగంతుకుడు.

గిరాటు వెయ్యకుండా తిప్పి పక్కన నిలబెట్టాడు.

మేనల్లుడు మురారిదేవుడు! వెనగ్గా వచ్చి మేనమామ కళ్లు మూయబోయాడు.

''ఏమిటా పిచ్చిచేష్టలు మురారీ. ఇంకా నయం. నడుముకున్న చురక తీయలేదు. నాతోనా హాస్యం?''

''అమ్మో.. మామా! మీరింత ఏకాగ్రతతో ఉంటారని తెలియదు. కనీస ఊహకూడా నాకు రాలేదు. అమ్మో.. ఎంత వేగం! ఎంత ఒడుపు!!''

నవ్వాడు జాయచోడుడు. మేనల్లుని భుజంపై చెయ్యి వేసి నడుస్తూ అన్నాడు.

''పద లోపలికి. నా ముందు ఖడ్గచాలనం చేసినవాడిని అదే వేగంతో వాడి ఖడ్గం లాక్కొని వాడి కుత్తుక ఉత్తరించగలను. నా శరీరానికి కత్తిమొన ఆనించగల దూరంవరకూ ఎవ్వడూ రాలేడు. లిప్తమాత్రంలో వాడి కుత్తుక లేచిపోతుంది''

అప్పుడు చూశాడు పక్కన మరో యువకుడు..

మురారి ఈడు వాడు.

''ఆ.. మామా! ఇతడు హరిహరుడు.. నా అన్న!''

తుళ్లిపడ్డాడు. హరిహరుడా.. చనిపోయిన వాడు??

మురారి పకపకా నవ్వి..

''తండ్రిగారు, అమ్మ, అక్క అందరూ మీలాగే ఖంగుతిన్నారు. వీడు కాకతీయ వంశపువాడే. రాజనగరి నివాసి. అంతకుమించి నా ప్రాణమిత్రుడు..''

ఆ హరిహరుడు జాయచోడునికి నమస్కరించాడు.

''మామగారూ.. వందనం!''

సొంతసోదరుడు మరణించినా ఇక్కడో హరిహరుడు అనేవాణ్ని సోదరుడిగా పొందాడన్నమాట. బావుంది!

లోపలికి వెళ్లారు. మిత్రులిద్దరికీ పాన చషకాలు ఇచ్చి తానొకటి తీసుకుని విదేశీదంతపు దుత్తలోనున్న మధువును ముగ్గురి చషకాలలోకి ఒంపాడు. రాత్రివేళ పరిచారికలను అంగీకరించడు జాయచోడుడు.

ఏదో గుర్తొచ్చినట్లు..

''ఆ.. మురారీ! ఇతని పెళ్లికే వెళ్లి కొలని యుద్ధానికి రాలేదు కదూ??''

మురారి, హరిహరుడు ముఖాలు చూసుకుని మురిసిపోయారు.

''అవును మామా! నాకు వీడంటే అంత ప్రేమ!''

మధువును గుటకవేసి..

''మరో సంగతి. మఠియవాడలో జరిగిన గొడవలో చెయ్యో కాలో పోగొట్టుకోకుండా తప్పించుకున్న పదోవాడు వీడే.. కదూ??'' సూటిగా చూస్తూ అడిగాడు జాయచోడుడు.

ఇద్దరూ వెర్రిచూపులు చూశారు. చూసుకున్నారు.